క్లుప్తంగా

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలి



సాక్షి నెట్‌వర్క్ : సమాజంలోని ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అధికారులు పిలుపునిచ్చారు. 'నాటుదాం ఒక మొక్క.. అమ్మ పేరు మీద' కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుగ్గొండి, ఖానాపురం మండలాల్లో డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ అధికారులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. అలాగే వర్ధన్నపేటలో ఈజీఎస్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ రాజు, చెన్నారావుపేట, పర్వతగిరి, నల్లబెల్లి మండలాల్లో ఎంపీడీఓలు శ్రీవాణి, శంకర్‌నాయక్, నర్సింహమూర్తి మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



ఖానాపురం : మండలంలోని బండమీదిమామిడితండాలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మూడ్రోజులపాటు ప్రత్యేక పూజలు చేశారు. పూజారుల వేదమంత్రోచ్చరణల నడుమ బొడ్రాయి, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి, పీసీసీ సభ్యులు శొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, రామానంద్, వీరమనేని సాగర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు




నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన మార్త రాంబాబు (50) అనారోగ్యాన్ని తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్యకు చేసుకోగా ఆయన మృతదేహానికి కూతురు రమ్య తలకొరివి పెట్టింది. రాంబాబుకు కుమారులు లేకపోవడంతో రమ్య కొడుకై తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించడంతో గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

'సదరం'లో దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు


నర్సంపేట రూరల్ : నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సదరం క్యాంప్‌లో జిల్లాలోని అన్ని మండలాలు, మూడు మున్సిపాలిటీలకు చెందిన సుమారు 80 మంది దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి వివరాలు వెల్లడించారు. అర్థో విభాగానికి సంబంధించి 50 మంది, చెవిటి, మూగ విభాగాలకు సంబంధించి 30 మంది దివ్యాంగులు హాజరయ్యారని తెలిపారు. అర్హులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నుంచి సర్టిఫికెట్లు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అర్థో వైద్యాధికారి వీరేన్, ఫిజియోథెరపిస్టు నర్సింహారెడ్డి, వేణు, సురేందర్, ఈఎంటీ వైద్యులు నందిని, ఆడియోలజిస్టు వనజ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



రాయపర్తి : విధుల్లో చేరిన సందర్భంగా ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. తొలుత మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాలకుర్తి సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, పట్టణ అధ్యక్షుడు మచ్చ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు..



నర్సంపేట : స్థానిక డిగ్రీ కళాశాల (అటానమస్) రసాయన శాస్త్ర అధ్యాపకుడు భూక్య భద్రును డాక్టరేట్ పొందిన సందర్భంగా కళాశాల ఆవరణలో గురువారం సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ మల్లం నవీన్ మాట్లాడారు. కేయూ రసాయన శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ హనుమంతు పర్యవేక్షణలో భద్రు సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించాడని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు బైరి సత్యనారాయణ, కందాల సత్యనారాయణ, రహీమొద్దీన్, డాక్టర్ రాంబాబు, కమలాకర్, డాక్టర్ సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



నెక్కొండ : అంబేద్కర్ సెంటర్‌లో ధర్నాలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు



రుణమాఫీలో ఆంక్షలు సరికాదు

రుణమాఫీలో ఆంక్షలు సరికాదని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో నర్సంపేట, రాయపర్తి, తదితర మండలాల్లో గురువారం నిరసన ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. రహదారుల్లో ట్రాఫిక్ స్తంభించగా పోలీసులు క్రమబద్ధీకరించారు.

-సాక్షి నెట్‌వర్క్



రాయపర్తి : రాస్తారోకో చేస్తున్న నాయకులు



ఖానాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



దుగ్గొండి : రాస్తారోకో చేస్తున్న శ్రేణులు, రైతులు



నల్లబెల్లిలో..



చెన్నారావుపేటలో..

విద్యార్థుల ఉన్నతే ధ్యేయం



చెన్నారావుపేట : విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఏఎంఓ సుజన్‌తేజ



నెక్కొండ : రికార్డులు పరిశీలిస్తున్న రంగారావు



ఖానాపురం : భోజనాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

చెన్నారావుపేట : విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా బేస్‌లైన్ పరీక్ష నిర్వహించి అభ్యసనా సామర్థ్యాన్ని పరీక్షించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) ఉండ్రాతి సుజన్‌తేజ ఆదేశించారు. మండలంలోని చెన్నారావుపేట హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ పాఠశాల, ఖాదర్‌పేట పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుల, విద్యార్థులు హాజరు పట్టికలను పరిశీలించి మాట్లాడారు. నవంబర్‌లో ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించనున్న న్యాస్ పరీక్షకు 3, 6, 9 తరగతుల విద్యార్థులను సిద్ధం చేయాలని చెప్పారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని, తదితర సూచనలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పాపమ్మ, ఎస్‌ఓ జ్యోతి, ఉపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డి, కిషోర్, రజని, అనుపమ, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని అప్పల్‌రావుపేట, ఎస్సీ కాలనీ, వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలను స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రంగారావు తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్లను తనిఖీ చేయడంతోపాటు వివిధ రకాల మూల్యాంకనాలను పరిశీలించి మాట్లాడారు. విద్యాప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ శ్రీనివాసచారి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ పరిశీలించారు. ఏజెన్సీ నిర్వాహకులతోపాటు విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా తయారీపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, ఎంపీఓ సునీల్, కార్యదర్శి రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో సాగితే విజయం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ భరత్

● టెలీమానస్ శిక్షకుడు, సైకియాట్రిస్ట్ భరత్

ఖానాపురం : ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే విజయం సాధించడం ఖాయమని టెలీమానస్ శిక్షకుడు, ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ భరత్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన మానసిక శిక్షణా కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠ్యాంశాల్లో పట్టు సాధించేలా విద్యార్థులు నిరంతరం పఠనంపై దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా అధైర్యపడకూడదని చెప్పారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని తెలిపారు. విద్యార్థుల్లో మానసిక సమస్యలు పరిష్కరించే దిశగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు మనసును నియంత్రణలో ఉంచుకుని ఏకాగ్రతతో పాఠ్యాంశాలను అధ్యయనం చేయాలని సూచించారు. తద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించడం సులువని చెప్పారు. సమావేశంలో ప్రిన్సిపాల్ సదానందం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరాచికపు సదానందం, అధ్యాపకులు విజయ్‌కుమార్, రవికుమార్, శోభ, రమాదేవి, రాజేష్, తిరుపతమ్మ, కృష్ణమూర్తి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



'కర్ర'ంటు స్తంభాలే దిక్కు

మండల కేంద్రంలో రైతు ఊడుత వీరన్న తన వ్యవసాయ భూమిలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలకు కర్రతో ఏర్పాటు చేసుకున్న స్తంభం ఇది. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో రైతులే 'కర్ర'ంటు స్తంభాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మిడిల్ పోల్ వేయించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. -నల్లబెల్లి

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
రాజు, ఇన్‌చార్జ్ ఏఈ, ఎన్పీడీసీఎల్
ఫోన్‌నంబర్ : 9440811372

బాలల వికాసంలో అంగన్‌వాడీలు కీలకం



సూపర్‌వైజర్లను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నల్లబెల్లి : బాలల వికాసంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకంగా వ్యవహరించాలని నర్సంపేట సీడీపీఓ మధురిమ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నల్లబెల్లి, దుగ్గొండి మండలాల్లోని అంగన్‌వాడీ టీచర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా (ప్రీ ప్రైమరీ స్కూల్స్) తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెరిగేలా చొరవ తీసుకోవాలని చెప్పారు. ఏజెన్సీల నిర్వాహకులు నాసిరకం సరుకులు అందిస్తే తిరస్కరించాలని తెలిపారు. ప్రీస్కూల్ కార్యక్రమాల అమలులో లోటుపాట్లపై చర్చించారు. మహిళలు, చిన్నారులపై దాడులు, అఘాయిత్యాలు చోటు చేసుకుంటే వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బదిలీపై వచ్చిన సీడీపీఓ మధురిమ, ఏసీడీపీఏ హేమలత, సూపర్‌వైజర్లు అరుణ, హేమలతను సన్మానించారు.

మహిళల రక్షణకు 'సఖి' ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న స్వప్న

సంగెం : గృహహింస, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు రక్షణకు సఖి కేంద్రం ప్రాధాన్యం ఇస్తోందని కేస్ వర్కర్ స్వప్న తెలిపారు. మండలంలోని బాలునాయక్‌తండాలో గ్రామైక్య సంఘాల సభ్యులకు సఖి కేంద్రంలో అందుతున్న సేవలపై గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సమాజంలో బాలికలు, మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వివాహితులు గృహహింస, తదితర సమస్యలు ఎదుర్కొంటుండగా బాలికలు వేధింపుల బారిన పడుతున్న దుస్థితి చోటు చేసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వాలు మహిళల, బాలికల రక్షణ కోసం అనేక చట్టాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. సమస్యలు ఎదురైనప్పుడు బాధిత మహిళలు, బాలికలు హెల్ప్‌లైన్ నంబర్ 181, 0879-3571832కు ఫోన్ చేస్తే తక్షణ సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ ఇందిర, అంగన్‌వాడీ టీచర్ విజయ, ఆశా కార్యకర్త లలిత, వీఏఓ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభ్యాసంలో క్రమశిక్షణ కీలకం

నర్సంపేట రూరల్ : విద్యాభ్యాసంలో క్రమశిక్షణ కీలకమని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు గురువారం ఏర్పాటు చేసిన ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు కళాశాల స్థాయిలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు కోడింగ్ స్కిల్స్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ వనజ, ప్రిన్సిపాల్ హరిహరన్, తదితరులు పాల్గొన్నారు.

చెట్ల పొదల తొలగింపు



సాక్షి స్పందన

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ సమీపంలోని నర్సంపేట-నెక్కొండ ప్రధాన రహదారిపై ఉన్న దట్టమైన చెట్ల పొదలను పంచాయతీ సిబ్బంది గురువారం తొలగించారు. ఈనెల 15న 'అటెన్షన్ ప్లీజ్' శీర్షికలో 'సాక్షి' ప్రచురించిన కథనానికి పంచాయతీ కార్యదర్శి వికాస్ గౌడ్ స్పందించారు. చెట్ల పొదలను తొలగింపజేశారు. దీంతో ప్రయాణికులకు ఎదురుగా వచ్చే వాహనాలు క్లియర్‌గా కనిపిస్తున్నాయి.

బురద రోడ్డుపై మట్టి..



మండలంలోని పాత మగ్దుంపురంలోని బురద రోడ్డుపై ఇటుకబట్టీ పొడిని సిబ్బంది పోయించారు. గ్రామంలోని మట్టి రోడ్డు బురదమయంగా మారి నడిచేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతుండగా 'అటెన్షన్ ప్లీజ్' శీర్షికలో 'బురదయంగా రోడ్డు' కథనం గురువారం ప్రచురించగా పంచాయతీ కార్యదర్శి మహ్మద్ షంషాద్దీన్ స్పందించారు. సిబ్బందితో బురదగా ఉన్న ప్రదేశంలో ఇటుక బట్టీల వద్ద ఉన్న డస్ట్ పోయించారు.

'నేడు పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలి'

చెన్నారావుపేట : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు నేడు (శుక్రవారం) పెన్షన్ విద్రోహ దినంగా పాటించి జిల్లావ్యాప్తంగా జీఓ నంబర్ 28 ప్రతులను దహనం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సోనబోయిన రవిచంద్ర కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో యూనియన్ జిల్లా బాధ్యులు నీలం రమేష్, మండల అధ్యక్షుడు బానోతు వెంకన్న, ప్రధాన కార్యదర్శి అజ్మీర స్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జాతీయ వృద్ధుల దినోత్సవం



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో సీనియర్ సిటిజన్ క్లబ్ మండల కమిటీ ఆధ్వర్యంలో జాతీయ వృద్ధుల దినోత్సవ వేడుక గురువారం నిర్వహించారు. గ్రామానికి చెందిన వయో వృద్ధురాలు అంద్ర లక్ష్మమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల వ్యవస్థాపకులు కంది గోపాల్‌రెడ్డి, విజయ, సంఘ అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య, కోశాధికారి వరంగంటి కుమారస్వామి, సభ్యులు నర్సింహాచారి, తాళ్లపెల్లి కొమ్మాలు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఐక్యతతో గెలుపునకు కృషి చేయండి'

గీసుకొండ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులు ఐక్యతతో ప్రజాప్రతినిధులుగా గెలవడానికి కృషి చేయాలని మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ కోరారు. మండలంలోని కొమ్మాలలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎంబాడి రాము ఆధ్వర్యంలో ముదిరాజ్ కులస్తులను కలిసిన సందర్భంగా దేవేందర్ మాట్లాడారు.

పరామర్శ

నర్సంపేట : పట్టణంలోని మూడో వార్డుకు చెందిన శంకపెల్లి అమృతమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ అనుబంధ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి గురువారం పరామర్శించారు. తొలుత అమృతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం 50 కిలోల బియ్యం అందించారు.

ఆర్థికసాయం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాధన్నపేటకు చెందిన గొర్రె శారదకు పటేల్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేలు, నర్సంపేటకు చెందిన రాము రైస్ మర్చంట్ యాజమాని రూ.3,116 సాయం గురువారం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడారు. శారద కుమారులకు చెందిన ఉమ్మడి ఇల్లు ఇటీవల షార్ట్ సర్క్యూట్‌కు గురై నిత్యావసర సరుకులతోపాటు విలువైన సామగ్రి కాలిపోగా బాధిత కుటుంబానికి సాయం అందించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడి..

గీసుకొండ : మండలంలోని బొడ్డుచింతలపెల్లికి చెందిన గంప లక్ష్మి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిషోర్‌రెడ్డి గురువారం రూ.5 వేల సాయం చేశారు. ఆయన పంపిన నగదును బాధిత కుటుంబానికి నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్, మాదాసి రాంబాబు, కేదాసి మోహన్, కూనమల్ల భాస్కర్, సాంబయ్య, రాంరెడ్డి, గోపాల్ తదితరులు అందజేశారు.

'ఎస్‌ఆర్‌ఆర్' ఆధ్వర్యంలో

రాయపర్తి : మండలంలోని కేశవాపురం, కాట్రపల్లి గ్రామాలకు చెందిన బూడిద మల్లయ్య, చిలుముల కొమురమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 75 కేజీల చొప్పున బియ్యం, నూనె, ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. తొలుత ఆ సంస్థ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి బాధితులను ఫోన్‌లో పరామర్శించారు. కార్యక్రమాల్లో ఫౌండేషన్ ప్రతినిధులు సురేందర్ రాథోడ్, వల్లాల సుధాకర్, మాజీ సర్పంచ్ చిలుముల ఎల్లమ్మ యాకయ్య, చిలుముల రాజు, బూడిద అనిల్, సోమయ్య, సదానందం, రాయుడు, యాకయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : పట్టణంలోని 16వ వార్డుకు చెందిన ఆగారపు సాయిలు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు, 4వ వార్డు కౌన్సిలర్ శీలం రాంబాబు గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజేందర్, గూడూరు సందీప్, ఉపాధ్యక్షుడు కందికొండ శ్రీను, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సామల ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి రాజ్‌కుమార్, యువ మోర్చా జిల్లా నాయకులు అన్వేష్, బూత్ అధ్యక్షుడు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

చెన్నారావుపేట : ఇంట్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్ గురువారం తెలిపారు. మండలంలోని పాపయ్యపేటకు చెందిన చినూరి యాకయ్య ఇంట్లో అతనితోపాటు మామిడాల రమేష్, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఉప్పెడకు చెందిన రాచకొండ నర్సింహరాములు తవ్వకాలు చేపట్టినట్లు తెలిపారు. మరికొందరు అనుమానితులను విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జర్నలిస్టు మృతికి నివాళి

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు సిరిపురం తిరుపతిరెడ్డి (52) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కొన్ని రోజులుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు గురువారం ఉదయం డయాలసిస్ కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా బీపీ పెరిగి చనిపోయారు. మృతుడికి భార్య రమాదేవి, కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా, ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, రెడ్డి సంఘం రాష్ట్ర కన్వీనర్ గోపు జైపాల్‌రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రజినికిషన్ తదితరులు నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వర్ధన్నపేట : నడుపుతున్న బైక్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న గేదెను ఢీకొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రాయపర్తి మండలంలోని మొరిపిరాలకు చెందిన చెడుపాక ఇషాక్ (బన్నీ) బైక్‌పై వరంగల్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా వర్ధన్నపేట శివారు సంగెపు వాగు వద్ద వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఎదురుగా గేదె అకస్మాత్తుగా అడ్డు రావడంతో ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఏసీపీ నర్సయ్య, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, రాజు ఘటగా స్థలికి చేరుకుని ఇషాక్‌ను అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

రుణమాఫీ కోసం దరఖాస్తులు

ఖానాపురం : పలువురు రైతులు రుణమాఫీ కాకపోవడంతో వ్యవసాయ అధికారులకు మళ్లీ దరఖాస్తులు అందజేస్తున్నారు. రైతు వేదికల్లో వ్యవసయ విస్తరణ అధికారులను కలిసి గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఇప్పటివరకు రూ.2 లక్షల మాఫీ కాని వాటితోపాటు రూ.2 లక్షలకుపైగా అప్పు ఉండి అర్హులైనా మాఫీ ఎందుకు కాలేదని అడిగి తెలుసుకుంటున్నారు. కాగా రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయ అధికారులకు దరఖాస్తులు అందజేస్తుండడంతో రైతువేదికల్లో సందడి నెలకొంది.

టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

చెన్నారావుపేట : విద్యార్థులు అధునాతన టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని జయముఖి ఇంజనీరింగ్ కళాశాల ఐఈఈఈ విభాగం సలహాదారు డాక్టర్ సంధ్యారాణి సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయలో 8, 9వ తరగతుల విద్యార్థులకు 'అధునాతన టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, ఏఐఎంఎల్, ఐఓటీ, నానో టెక్నాలజీ'పై హైదరాబాద్‌కు చెందిన ఐఈఈఈ ఉమెన్ ఇన్ ఇంజనీరింగ్ ప్రవేశపెట్టిన టెక్ గర్ల్స్ కార్యక్రమాన్ని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలోని ఐఈఈఈ బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఇఓట్ ప్రాజెక్టును ప్రదర్శించారు. ఇంట్లో, పంట పొలాల్లో వినియోగించే తీరును వివరించారు. సైబర్ నేరాల నుంచి ఎలా కాపాడుకోవాలి, వ్యక్తిగత సమాచారం, సోషల్ మీడియాలో పెట్టడం వల్ల కలిగే సమస్యలు, ప్రమాదం గురించి అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ అండ్ ఐఓటీ కిట్లను స్కూల్‌కు బహూకరించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, శ్రీధర్, ఎస్‌ఓ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఆరోగ్య పరిరక్షణ

వర్ధన్నపేట : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని బాలవికాస ఏరియా కోఆర్డినేటర్ పిట్టల రాణి తెలిపారు. మండలంలోని కడారిగూడెంలో హనుమకొండలోని లక్ష్మీ నర్సింహ ఆస్పత్రి యాజమాన్య సహకారంతో బాలవికాస ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతీఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. సామాజిక బాధ్యతలో భాగంగా శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు నిఖిత, ఆస్పత్రి పీఆర్‌ఓ సుభాష్, పాషా, సిస్టర్లు ప్రసన్న, కృష్ణవేణి, బాలవికాస ప్రతినిధులు ఫాతిమ, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

చెన్నారావుపేట : సమాచార హక్కు (సహ) చట్టం పరిరక్షణ యూత్ మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి రాము, ఉపాధ్యక్షుడుగా అనుముల సందీప్, ప్రధాన కార్యదర్శిగా దాసరి విజయకాంత్, కార్యదర్శిగా నూనె శ్రీనాథ్ ఎన్నికయ్యారు.

నేడు వైద్యశిబిరం

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నేడు (శుక్రవారం) ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సరోజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, పేడియాట్రీ, స్త్రీల వైద్య నిపుణులు హాజరై వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. మండల ప్రజలు శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.